క్లుప్తంగా

అభ్యసనా సామర్థ్యాల మెరుగుకు కృషి



పాతూరులో విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరావు

భీమడోలు: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరులో ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల నోటు పుస్తకాలు, వర్క్ పుస్తకాలను పరిశీలించారు. ఎండీఎం రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.నిర్మలకుమారి, టీచర్ మండే సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

దోమలతోనే బోద వ్యాప్తి



పోస్టర్ విడుదల చేసిన ఎంపీడీఓ, వైద్యాధికారులు

గణపవరం: దోమలతోనే ఫైలేరియా వ్యాధి వ్యాప్తి చెందుతుందని ఎంపీడీఓ బేబీ శ్రీలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారులు పులపర్తి సంతోష్ అన్నారు. గురువారం గణపవరం పీహెచ్‌సీ పరిధిలోని సరిపల్లె సచివాలయంలో ప్రపంచ ఫైలేరియా దినోత్సవం సందర్భంగా బోద వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సంతోష్ మాట్లాడుతూ క్యూలెక్స్ అనేదోమ కారణంగా బోద వ్యాధి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. బోద లక్షణాలు కనిపిస్తే వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించాలని సూచించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలని, దోమల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని, దోమల లార్వాను నిర్మూలించాలని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జాలాది విల్సన్, పంచాయతీ కార్యదర్శి డి.రామాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ సభ్యుడికి పరామర్శ



జల్లికొమ్మరలో బుద్దాలను పరామర్శిస్తున్న వాసుబాబు

గణపవరం: మండలంలోని జల్లికొమ్మర ఎంపీటీసీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నేత నాయకుడు బుద్దాల వెంకటేశ్వరరావు తల్లి సావిత్రి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. బుద్దాల కుటుంబీకులను మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గురువారం పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మద్యం దుకాణానికి దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ సత్యనారాయణ

భీమడోలు: నిడమర్రు మండలంలోని శెట్టి బలిజ కులానికి కేటాయించిన మద్యం దుకాణం ఎంపికకు భీమడోలు ఎక్సైజ్ స్టేషన్‌లో దరఖాస్తుల స్వీకరణ కౌంటర్ ఏర్పాటు చేశారు. దీనిని గురువారం సీఐ బి.సత్యనారాయణను పరిశీలించారు. ఈ షాపునకు వచ్చే నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు భీమడోలు ఎక్సైజ్ కార్యాలయంలో లేక ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అందించాలన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు డీడీ, చలానా రూపంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పేర తీయాలని తెలిపారు. కుల, ఆధార్, నివాస ధ్రువీకరణ పత్రాలను అందజేయాలన్నారు. ఫిబ్రవరి 7న ఉదయం 10 గంటలకు డ్రా తీస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై శివధార, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: జాతీయ భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం కైకరం హైస్కూల్ విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, స్లోగన్స్ పోటీలు నిర్వహించారు. విజేతకు బహుమతులు అందజేశారు. ఎన్‌హెచ్ఏ (ఆర్‌ఈ) ఎం శ్రీనివాస్ రెడ్డి, మేనేజర్లు కె.బాలసుబ్రహ్మణ్యం, ఇంతియాజ్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ఆక్వా సాగుకు మంచు ముప్పు

- పొగ మంచుతో తగ్గుతున్న ఆక్సిజన్ లెవెల్స్
- నిరంతరం ఏరియేటర్లు తిరగాల్సిందే
- రైతుల ఆందోళన



నిడమర్రులో ఉదయం 9 గంటల తర్వాత కూడా తిరుగుతున్న ఏరియేటర్లు



తక్కువ కౌంట్‌తోనే బువ్వనపల్లిలో రొయ్యల పట్టుబడి చేస్తున్న దృశ్యం

నిడమర్రు: ఉదయం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మంచు ఆక్వా సాగుకు గండంగా మారింది. ఉదయం 9 గంటలైనా చెరువులపై మంచు దుప్పటి కప్పినట్లు ఉండటంతో నీటిలో ఆక్సిజన్ లెవెల్స్‌తో పాటు, పీహెచ్ లెవెల్స్ సైతం తక్కువగా ఉండటంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఉంగుటూరు నియోజకవర్గంలో సుమారు 20 వేల ఎకరాల్లో రొయ్యి, 32 వేల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు వరుస తుపాన్లతో ఇబ్బంది పడ్డ చేపల, రొయ్యల సాగు రైతులు తాజాగా మంచుతో నీటిలో చల్లదనం పెరిగడంతో చెరువులోని రొయ్యి, చేపలను కాపాడుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

ఒడిదుడుకుల సాగు

ఇటీవల దారుణంగా పడిపోయిన చేపలు, రొయ్యల ధరలు కొద్దికొద్దిగా పెరుగుతూ ఆక్వారంగం కుదుటపడుతున్న సమయంలో ఉదయం పూట కురుస్తున్న మంచుతో ఆక్వా సాగు తిరిగి ఒడిదుడుకుల్లో సాగుతోంది. చెరువునీటిలో సమయానికి సూర్యరశ్మి చేరక ఆక్సిజన్ లెవెల్స్ పడిపోవడంతో చేపలు, రొయ్యలు నీటి ఉపరితలంపై తిరుగుతున్నట్టు రైతులు చెబుతున్నారు. ఈ సమస్యను అధికమించేందుకు ఆక్వా రైతులు నిరంతరం చెరువుల్లో ఏరియేటర్లు తిప్పుతున్నారు. విద్యుత్ సరఫరా లేని చెరువుల వద్ద డీజిల్ ఇంజిన్లతో ఏరియేటర్లు 24 గంటలూ తిప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు రైతులు చెరువుల్లో ఆక్సిజన్ లెవెల్స్ పెంచడానికి, పీహెచ్ లెవెల్ ఉండాల్సిన దానికంటే తక్కువగా ఉంటే ఆ లోటును పూడ్చడానికి రసాయనాలు చల్లుతున్నారు.

15 రోజులుగా మంచు జల్లు

గత 15 రోజులుగా చిరుజల్లుగా పడుతున్న మంచుతో ఉదయం 10 గంటల వరకు ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిపోవడంతో చేపలు, రొయ్యలు తెగుళ్లబారిన పడకుండా, పంటను కాపాడుకునేందుకు రైతులు టెక్నీషియన్ల చుట్టూ తిరుగుతున్నారు. కొందరు 120 నుంచి 100 కౌంటు ఉన్న రొయ్యలను పెద్ద కౌంటుకు చూడకుండా అర్ధంతరంగా పట్టుబడులకు ఉపక్రమిస్తున్నారు. ఇటీవల రొయ్యలసాగు వరసగా దెబ్బతినడంతో 30 శాతం మంది ఆ చెరువులో రూప్ చంద్ చేపల పెంపకం చేపట్టారు.

ప్రతికూల వాతావరణంతో తెగుళ్లు

ఆక్వా సాగుకు ఉదయం మంచు. మధ్యాహ్నం ఎండ, రాత్రి చలి వంటి ప్రతి కూల వాతావరణంతో రొయ్యలకు వైరస్, చేపలకు మొప్పతెగులు వంటివి సోకుతుండతంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువుల్లో ఉష్ణోగ్రతలు తగ్గితే నిరంతరం ఏరియోటర్లు తిప్పుకోవాలని మత్స్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. రొయ్య పెద్ద కౌంట్‌కు చేరుకుంటున్న చెరువులు యజమానులు ఉదయం పీహెచ్ లెవెల్స్ ఎప్పటి కప్పుడు చూసుకోవాలి. ఆక్సిజన్ తక్కువగా ఉంటే పొటాషియం పర్మాంగనేట్ సిద్ధం చేసుకోవాలి. టెక్నీషియన్ల సూచనలతో అవసరం మేరకు చెరువుల్లో చల్లుతుండాలి. ఆక్సిజన్ సమస్య ఉంటే మేతలు సరిగా తినవు. దీంతో ఆ విషయం గమనించి పరిమితం మేరే చెరువుల్లో మేతలు వేస్తుండాలని మత్స్యశాఖ అధికారులు, ఆక్వా టెక్నీషియన్లు చెబుతున్నారు.

మంచుతో సమస్యలు



ఉదయం కురుస్తున్న మంచుతో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. ఆక్సిజన్‌తోపాటు పీహెచ్ సమస్యా కనిపిస్తోంది. సాధారణంగా పీహెచ్ 7.5 నుంచి 8.5 వరకు ఉండాలి. కౌంట్‌కు వచ్చిన చెరువుల్లో డీఓ (డిజాల్వ్ ఆక్సిజన్) తగ్గినట్టు గమనిస్తే ఆక్సిజన్ బిళ్లలు, పొండర్ చెరువులకు అందించాలి. పీవీసీ లైమ్, అగ్రికల్చర్ లైమ్ కూడా చెరువుల్లో చల్లుకోవాలి. - జువ్వలపల్లి రవీంద్ర, సీనియర్ ఆక్వా టెక్నీషియన్, నిడమర్రు

ముందస్తు చర్యలు చేపట్టాలి



ఉదయం కురుస్తున్న మంచు సమస్యను అధిగమించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలి. ఉదయం ఎండ వచ్చి తగిన సూర్యరశ్మి అందే వరకు ఆక్వా చెరువుపై నిరంతరం పర్యవేక్షణ అవసరం. రైతులకు భారంగా ఉన్నా నిరంతరం ఏరియేటర్లు తిప్పితూ, అవసరం మేరకే మేతలు అందిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు.
- వేగిరెడ్డి యుగంధర్, ఆక్వా రైతు సంక్షేమ సంఘం సభ్యులు, నిడమర్రు

ఉపాధ్యాయ సమస్యలపై వినతి



ఎంఈఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ నాయకులు

భీమడోలు: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం యూటీఎఫ్ స్థానిక శాఖ నాయకులు ఎంఈఓ ఈదుపల్లి శ్రీనివాసరావుకు భీమడోలు ఎంఆర్సీలో వినతిపత్రం అందజేశారు. పని సర్దుబాటు పేరుతో అసంబద్ధ డెప్యూటేషన్లు వల్ల పాఠశాలల నిర్వహణ కష్టంగా ఉందని, కార్యాలయం నుంచి పంపించే మెస్సేజులతో టీచర్లు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఒత్తిళ్లతో విధులు నిర్వర్తిస్తున్నామని, విద్యాశాఖ అధికారుల సందర్శించే తరుణంలో పాఠశాల నిర్వహణలోని లోపాలను ఎత్తి చూపుతున్నారని, ఇదే తరుణంలో చక్కగా పని చేసే వారిని కూడా ప్రోత్సహించాలని కోరారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఈఓ హామీ ఇచ్చినట్టు యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు బి.సత్యనారాయణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.బాలభాస్కర్, ఎం శేఖర్‌లు తెలిపారు. హెచ్ఎంలు ఎం సుబ్రహ్మణ్యం, ఆర్ సింధూరి, పి.మాధవి, ఉపేంద్ర, టీచర్లు నాగేశ్వరరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ అండ్ టీ చైర్మన్‌పై చర్యలకు డిమాండ్

ఏలూరు రూరల్ : ఉద్యోగులు, కార్మికుల పని దినాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎల్అండ్‌టీ చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు.

మహిళల సంరక్షణే ధ్యేయం



దుగ్గిరాల దంత కళాశాలలో విద్యార్థులకు జాగ్రత్తలు వివరిస్తున్న సీఐ సుబ్బారావు

పెదవేగి : మహిళల సంరక్షణే ధ్యేయంగా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తోందని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత కళాశాల్లో గురువారం మహిళా ఎస్సై కాంతి ప్రియ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా అభయ మహిళా రక్షక దళ సభ్యులు పెదవేగి మండలం దుగ్గిరాల దంత వైద్య కళాశాల ప్రాంతంలో గస్తీలు నిర్వహించారు. సైబర్ నేరాల నివారణకు జాబు ఫ్రాడ్స్, లోన్ ఫ్రాడ్స్, ఏపీకే యాప్‌ల ద్వారా జరిగే మోసాలపై ప్రజలకు దృశ్య రూపంలో వివరించారు. సోషల్ మీడియా ద్వారా వెలువడే ముప్పులపై అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలు, వృద్ధుల రక్షణకు ఎస్పీ ఏర్పాటుచేసిన వాట్సాప్ నెంబర్ 95503 51100కు సమాచారం అందించిన వెంటనే పోలీస్ సేవలు అందుతాయని వివరించారు.

అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు అన్నారు. వేగవరం హేలాపురి ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సైబర్ మోసాలపై ఏర్పాటుచేసిన అవగాహన సమావేశంలో సీఐ మాట్లాడారు. ఇష్టపడి క్రమశిక్షణతో చదవినప్పుడే ఫలితం ఉంటుందని అన్నారు. సమావేశంలో సైబర్ సెల్ ఏలూరు ఎస్సై రాజు, ప్రిన్సిపాల్ లావణ్య, కళాశాల ఏఓ కరుణానిధి ఉన్నారు.

విద్యార్థులు జర జాగ్రత్త

భీమడోలు: సైబర్ నేరాలు, సోషల్ మీడియా ఉచ్చులో పడొద్దని భీమడోలు ఎస్సై వై.సుధాకర్ అన్నారు. కురెళ్లగూడెం, పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురవారం సాయంత్రం ఏలూరు అభయ మహిళా రక్షక దళ సభ్యులు, మహిళా పోలీస్ సిబ్బంది, అభయా వాహనం ద్వారా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలపై 1098కు, సైబర్ నేరాలపై 1930కు ఫోన్ చేయాలని ఎస్సై సుధాకర్ కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం పెనుగొండ భువనేశ్వరరావు, ఏఎస్సై వెంకటేశ్వరరావు, మహిళా సంరక్షణ సహాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్ల పరిశీలన



గణపవరం : కొమ్మరలో వికలాంగ పింఛనుదారుతో మాట్లాడుతున్న వైద్యసిబ్బంది



ఉంగుటూరు : పింఛనుదారు ఆరోగ్యాన్ని పరిశీలిస్తున్న వైద్యుడు

గణపవరం: మండలంలో వికలాంగుల పింఛన్ల పరిశీలన పూర్తయినట్టు ఎంపీడీఓ బేబీ శ్రీలక్ష్మి తెలిపారు. మండలంలోని 25 గ్రామాలలో మూడు రోజుల పాటు వైద్యాధికారులు, పంచాయతీ సిబ్బంది దివ్యాంగ పింఛన్లు తీసుకునే వారి ఇళ్లకు వెళ్లి వాస్తవ పరిస్థితులు పరిశీలించారని పేర్కొన్నారు. ఈ మేరకు నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

ఉంగుటూరు మండలంలో..

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో పింఛన్ పొందుతూ మంచానికి పరిమితమైన లబ్ధిదారులతో సర్వే టీము సభ్యులు గురువారం మాట్లాడారు. 81 మంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 4 బృందాలుగా ఏర్పడి ఈ సర్వే చేశారు. కార్యక్రమాన్ని ఎంపీడీఓ రాజ్‌మనోజు పర్యవేక్షించారు.

మహోన్నతుడు మహాత్మాగాంధీ



భీమడోలు : పోలసానిపల్లిలో నివాళులర్పిస్తున్న సర్పంచ్ రహీమ, సచివాలయ ఉద్యోగులు



దెందులూరు : గాంధీ విగ్రహం వద్ద నివాళి

భీమడోలు: జాతిపిత మహాత్మా గాంధీ అహింసా, సత్యం నినాదాలతో స్వాతంత్ర్యాన్ని సిద్ధింపజేసిన మహోన్నత వ్యక్తి అని పలువురు వక్తలు కొనియాడారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా గురువారం పోలసానిపల్లి పంచాయతీలో సర్పంచ్ షేక్ రహీమ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భీమడోలు గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యర్రంశెట్టి ఏడుకొండలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. గాంధీజీ సేవలు వక్తలు కొనియాడారు. కార్యక్రమాల్లో గ్రామ కార్యదర్శి యు.జయరామకృష్ణ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

జాతిపిత ఆశయాలు స్ఫూర్తిదాయకం

దెందులూరు: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలు, పోరాటాలు భారతావనికి స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు అన్నారు. గాంధీజీ వర్ధంతిని మండలంలో కొవ్వలి, పోతునూరు, సోమవరప్పాడు, నాగులదేవునిపాడు, దెందులూరు, సీతంపేట పాఠశాలల్లో గురువారం నిర్వహించారు. గాంధీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దెందులూరు బస్టాండ్ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

‘స్పర్శ’తో కుష్ఠుపై అవగాహన



దెందులూరు : వేగవరంలో దుప్పట్లు, చెప్పలు ఎంపిణీ చేస్తున్న దృశ్యం



గణపవరం : కాశిపాడులో దుస్తులు, పండ్లు పంచుతున్న దృశ్యం

దెందులూరు: స్పర్శతో కుష్ఠి వ్యాధిపై సమాజంలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా లెప్రసీ ఎయిడ్స్ టీబీ ఆఫీసర్ ఎం నాగేశ్వరరావు అన్నారు. గురువారం వేగవరం డామియల్ లెప్రసీ సెంటర్‌లో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సత్యానందం సిస్టర్ రోసి ఆధ్వర్యంలో ఆయన స్పర్శ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. వచ్చే నెల 13వ తేదీ వరకు స్పర్శ కొనసాగుతుందని చెప్పారు. కుష్ఠి పూర్తిగా మందులతో తగ్గుతుందని తెలిపారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వచ్చి పరీక్షించి వ్యాధి నిర్ధారణ చేస్తారని, వ్యాధి నిర్ధారణ అయితే సమీప ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స తీసుకోవాలని అన్నారు. వేగవరం ఆర్‌సీఎం ఫాదర్ మోజస్, డామేన్ లెప్రసీ సెంటర్ సిస్టర్ రోసి మాట్లాడుతూ కుష్ఠుకు సరైన సమయంలో మందులు వాడి వ్యాధిని నయం చేసుకోవాలన్నారు. డామియల్ లెప్రసీ సెంటర్‌లో బాధితులకు మందులు, చెప్పులు, దుస్తులను అందజేశారు. తొలుత జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి డాక్టర్ నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దుస్తులు, పండ్లు పంపిణీ

గణపవరం: కుష్ఠు రహిత సమాజమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు పేర్కొన్నారు. గురువారం కుష్ఠు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద కుష్ఠుపై అవగాహన కల్పించారు. పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పెన్మెత్స అజయ్‌కుమార్‌రాజులు మాట్లాడుతూ కుష్ఠు లక్షణాలు కనిపిస్తే వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించి ఉచితంగా మందులు, చికిత్స తీసుకుంటే వ్యాధిని అదుపులో ఉంచవచ్చని వివరించారు. అనంతరం గ్రామ క్షత్రియసేవా సమితి ఆధ్వర్యంలో కుష్ఠు బాధితులకు ఉచితంగా మందులు, దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తెర్లి నాగరాజు, పంచాయతీ కార్యదర్శి జాషువా తదితరులు పాల్గొన్నారు.

జూట్ ఉత్పత్తులను వినియోగించాలి



జూట్ సంచులను చూపుతున్న మెప్మా అధికారులు

ఏలూరు (టూటౌన్): ప్రతి ఒక్కరూ జూట్ ఉత్పత్తులను వినియోగించాలని మెప్మా సిటీ కోఆర్డినేటర్ శ్యాంప్రసాద్, జిల్లా రిసోర్స్ పర్సన్ అఖిల్ అన్నారు. స్థానిక లంకపేటలోని జోన్స్ ఎంటర్‌ప్రైజెస్ జూట్ మేకింగ్ సెంటర్‌ను వారు గురువారం సందర్శించారు. స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు విస్తృతమైన మార్కెటింగ్ సౌకర్యం కల్పించే ఉద్దేశంతో ఆన్‌లైన్, స్మార్ట్ విధానానికి అవకాశం కల్పించారని చెప్పారు. జూట్ ఉత్పత్తులను ఆన్‌లైన్ ద్వారా మార్కెట్లో ప్రమోట్ చేస్తున్నారని జోన్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ పెరికె దీన గ్లాడి తెలిపారు. సింధూర గ్రూపు సభ్యురాలు పోతురాజు మేరీ తనుజ ఫుడ్ ఐటమ్స్‌ను సెంటర్లో ప్రదర్శించారు. సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు మాట్లాడుతూ పర్యావరణం పరిరక్షణలో భాగంగా జూట్ బ్యాగ్స్ అందరూ వాడాలని సూచించారు.

థెరిస్సా విద్యార్థినుల ప్రతిభ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పరిధిలో ఉన్న వివిధ కళాశాలల జట్ల మధ్య నిర్వహించిన బాల్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ విద్యార్థినులు విజేతలుగా నిలిచారని స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ తెలిపారు. ఈ నెల 24న నిడదవోలు ఎస్‌వీడీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జి.పూజ, జి.పుణ్య, పి.నాగ వినయశ్రీలు అద్భుత ప్రతిభ కనబర్చారని చెప్పారు. వీరు త్వరలో తమిళనాడులోని కారేపూడి అలగప్ప విశ్వవిద్యాలయంలో నిర్వహించే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు నన్నయ యూనివర్శిటీ జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో అన్నవరంలోని ఎస్‌వీవీఎస్‌డీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల మహిళల హ్యాండ్ బాల్ పోటీల్లో తమ కళాశాల జట్టు విజేతగా నిలిచిందన్నారు. ఈ జట్టులోని ఎ.షల్లి, జి.పుణ్య, ఎస్ జెస్సి తన్మయ్, టి.జ్యోతిలు తమిళనాడు సేలంలోని పెరియార్ యూనివర్సిటీలో నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కి ఎంపికయ్యారని వివరించారు. ఈ జట్లను గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): ఎన్నికల వాగ్దానం మేరకు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అర్హులైన పేదల అర్జీలను స్థానిక చేపల తూము సెంటర్ వార్డు సచివాలయంలో కార్యదర్శికి గురువారం అందజేశారు. ఎన్నికల హామీ మేరకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇవ్వాలని కోరారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిబ్రవరి 10న కలెక్టరేట్ వద్ద ఆందోళన చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కారం దారయ్య, పుప్పాల కన్నబాబు, వరక శ్యామల, మన్నవ యామిని, భజంత్రీ శ్రీనివాసరావు, కె.రోజా, బి.లక్ష్మి, ఎ.మల్లీశ్వరి, శ్రావణి, ఉమా గౌరి, కె.చంద్రకుమారి, ఎం కోటేశ్వరి, బి.ప్రసన్న రాణి, కె.దేవి, వి.స్వప్నకుమారి పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్ర బాబు

ఏలూరు (టూటౌన్): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు విమర్శించారు. ఏఐవైఎఫ్ ఏలూరు జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఏలూరు స్ఫూర్తి భవన్‌లో జిల్లా కన్వీనర్ తొర్లపాటి రాజు అధ్యక్షతన గురువారం సాయంత్రం నిర్వహించారు. రాజేంద్ర బాబు మాట్లాడుతూ కూటమి నేతల హామీ మేరకు తక్షణమే డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యలపై చర్చించాలని, నిరుద్యోగ భృతి ప్రకటించాలన్నారు. అమరావతి రాజధానిని ఫ్రీ జోన్ చేసి 26 జిల్లాల నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు 80 శాతం ఉద్యోగాలు కల్పించాలన్నారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకుని వారికి రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ నాయకులు భజంత్రీ శ్రీనివాస్, కన్వీనింగ్ కమిటీ సభ్యులు ప్రసాద్, ప్రసన్నకుమార్, తాళ్లూరి నాగరాజు, కృష్ణ శేఖర్, అంబేద్కర్, ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు శివకుమార్, జిల్లా కోశాధికారి కె.క్రాంతి కుమార్ పాల్గొన్నారు.